# వెన్నెల్లో

శ్రీమతి యల్లాప్రగడ సీతాకుమారి గారు

ఆవ్వేళ ఆశ్వయుజపౌర్ణమి. శరన్నవరాత్రాల హడావిళ్లలో, దేవీపూజల ఉద్రేకాలలో, దసరా సమావేశాల ఉత్సాహాలల్లో పాల్గొన్న అలసటతో, గర్వంతో చంద్రుడు ఆకాశంమీద మెల్లగా పైకి జరిగివస్తూ పలుకుబడిగల నాయకులు దేశమంతా తమ ఉద్దేశాలనే ప్రతిఫలింపచేసేటట్లు దట్టమైన చెట్ల కింద తప్ప మిగిలిన ప్రదేశాలన్నిట్లో తన చంద్రికల్ని ప్రసరింపచేసుకుంటున్నాడు.

అది క్వీనుగార్డెను. అప్పుడే చలిగాలి ప్రారంభిస్తున్నా, ఆవెన్నెల్ని వదలిపెట్టిపోలేక చాలామంది మనుష్యులింకా తిరుగుతూనే ఉన్నారు. అందులో దక్షిణవైపు తిన్నెమీద విజయలక్ష్మి, విశ్వానాథం కూచోని మత్తుగా బాధగా వెన్నెల్ని తాగేస్తున్నారు. పక్కనున్న రేరాణిపొదల్లోనుంచి గుములు గుములుగా తెరలు తెరలుగా వాసనలొచ్చి తల దిమ్మెత్తించేస్తున్నాయి.

"ఏడాదికి ఒక్కనాడు దొరుకుతుందీ ఈవెన్నెలు మనకు. దీన్నయినా అనుభవించడానికి అందరూ నోచుకోరు. ముఖ్యంగా ఆడవాళ్లు" అన్నాడు విశ్వం.

"నిజంగా ఇలాటి రోజునకూడా ఇంట్లోనే మురిగిపొయ్యే కుళ్లు మనుష్యుల్ని ఏమనాలో" అంది విజయప్రపంచంలో తనుతప్ప మరెవ్వరూ ప్రకృతి రసాస్వాదకులు లేరన్నట్లు.

ఇంతలో ఒక యువకుడు విజయానికి చాలా సమీపంలోనుంచి చూసుకుంటూపోయాడు. బహుశా దీర్ఘంగా వేలాడుతున్న అతనికోటు తిన్నెకింది కి వేలాడుతున్న విజయపాదాలకి తగిలిఉంటుంది.

"ఫూల్! ఇంతలో ఏంజరిగిందో అలా చూస్తూ పోతే వాడికి" అన్నాడు విశ్వం కొంచెం ఈర్ష్యతో.

"ఏదవనీ, ఇంతలో మనకొచ్చిన నష్టంమాత్రం ఏముంది. అంతగా అయితే నా పాదధూళి కొంచెం అతని పట్టుకోటుతో వెళ్లిపోయింది" అన్నది విజయ నిర్లక్ష్యంతో.

"నిజంగా ఈవెన్నెల్లో హాయికంటే అదో మోస్తరు బాధ కనిపిస్తున్నది నాకు."

"ఆబాధలోనే ఆఅసంతృప్తిలోనే నిజమైన ఆనందంఉంది. అసలీ వెన్నెల ముందు ఎలక్ట్రిక్‌షాక్‌లాగా బాధకలిగిస్తుంది. సురాపానంలాగా మత్తెక్కిస్తుంది. చివరికి వీణాగానంలాగా మనసు కరిగించేస్తుంది."

కొంచెం దూరంనుంచి ఒక ఎర్రటోపీయువకుడు అంత వెన్నెల్లోకూడా విజయముఖం విస్పష్టంగా కనిపించకనేమో జేబులోనుంచి సిగరెట్ కేసూ నిప్పెట్టెతీసి పుల్లవెలిగించి సిగరెట్ ముట్టించుకుంటూ ఆవెలుగులో విజయముఖం దర్శించాలని ప్రయత్నించాడు. కాని ముఖం పక్కకుతిప్పి మాట్లాడుతూ ఉండడంచేత సరీగా కనిపించలేదు గాని చెవ్వునుంచి

భుజంవరకూ వేలాడుతూన్న చేపపిల్ల డిజయిను లోలకుమాత్రం తళుక్కున ఒక్క మెరుపుమెరిసి ఊరుకున్నది. అగ్గిపుల్ల ఆరిపోగానే అతను ఇక చేసేది ఏమీలేక—

"ప్రేమకహై ఇస్ జగమే పాంథనిరా........లా ......" అంటూ సాగిపోయాడు.

"సరే కాని మనవిషయం మళ్లీ ఏ మాలోచించావు" అన్నాడు విశ్వం.

"అబ్బబ్బా ఈవెన్నెల్లో నీకు ఆలోచనలు చెయ్యాలనికూడా బుద్ధి పుడుతున్నదా?"

"ఈలాటి వెన్నెల్లో ఆలోచిస్తే ఫలితంకూడా మనోహరంగా ఉంటుంది."

"ఇంత మంచి వెన్నెల్ని ఎవరయినా సంతోషంగా నిర్విచారంగా అనుభవించాలి కాని ఆలోచనలు చేస్తూ బుర్ర బద్దలుకొట్టుకుంటూ కూచోగూడదు. ఆలోచనలన్నీ రేపు నిదానంగా ఇంట్లో ఈజీచైర్లో పడుకోని చేసుకోవచ్చు."

దూరంగాఉన్న అంజూరుచెట్టుమీదినుంచి ఓకోకిల కుహూ....కుహూ....అంటూ పొద్దుపోతున్నదని హెచ్చరించింది.

విజయ:–ఈవెన్నెల్లో ఈకోయిలకుకూడా నిద్ర పట్టలేదేమో, విరహగీతం పాడుతున్నది.

విశ్వం:–విరహగీతాలూ, ప్రణయగీతాలూ పాడడానికి అదేమి భావకవి అనుకున్నావా? అసలీ ఉత్ప్రేక్షంతా కవులదే. నాకు నిజంగా ఈ కోయిల కూత ఓకూతల్లేనే వినిపిస్తుంది. కాని అందులో గానమూ ఉండదు. గీతమూ ఉండదు.

విజయ:—అందులో మాధుర్యం తెలుసుకోనడానికి కవి అన్నా కావాలి, గాయకుడన్నా కావాలి. ఉత్తవాళ్లకి అంతా ఉత్తగానే కనిపిస్తుంది.

విశ్వం:—పొద్దుపోతున్నది మాలీలు తలుపులు మూసేస్తారు. ఇకలే పోదాం.

విజయ:—అంతా వెళ్లిపోయారు మనంతప్ప. ఇక మనంగూడా వెళ్లిపోతే ఈచంద్రుడొక్కడూ ఏంకావాలి......సరే ఎంతసేపున్నా వెళ్లాలిసిందేగా ఇకలే.

ఇద్దరూ అయిష్టంగా భారంగావచ్చి కారులో కూచున్నారు.

౨

విజయలక్ష్మి తల్లిదండ్రుల గారాబుబిడ్డ. ఆఏడే బియ్యే ప్యాసుచేసింది. ఉన్న చక్కదనంతో నాజూకుగా సభ్యతకు తక్కువకాకుండా అలంకరించుకొని ఎప్పుడూ ఉత్సాహంగా కలకల్లాడుతూ కనిపిస్తుంది. ఇక ముందేమి చెయ్యాలి, ఇప్పుడే దొరికినంతలో ఏదయినా ఉద్యోగంలో ప్రవేశించాలా, ఇంకా చదువుకోవాలా, చదివితే ఏంచదవాలి, పెళ్లిచేసుకోడం ఇప్పుడేనా? ఈవిధమైన సమస్యలు ఆమెను పజిల్ చేస్తూ ఉన్నాయి. ఇందులో తల్లిదండ్రు లెక్కువ అధికారం చలాయించకుండా ఆమె ఇష్టాన్ననుసరించే నడుస్తుంటారు.

విశ్వనాథం యల్.యల్.బీ ప్యాసుచేసి ప్రాక్టీసు ఎక్కడ ప్రారంభించాలీ అని చూస్తున్నాడు. దాదాపు రెండేళ్లనుంచీ విజయతో పరిచయముంది. ఆమె ఆశయాలకీ, విద్యకూ, రూపానికీ సంపూర్ణంగా ముగ్ధుడై వివాహం చేసుకోనడానికి ఎలాగైనా ఆమెను ఊ అనిపించాలని చూస్తున్నాడు. కాని విజయానికి ఎందుకో అతనిప్రేమ తగినంతతృప్తినియ్యలేదు. పోని ఇంకా ఎవరికీగూడ తనహృదయంలో చోటిచ్చినట్లూలేదు.

వెన్నెల్ని దాటిపోలేక కారునిదానంగా నడుస్తున్నది. మెల్లగా, చల్లగా, గాలికెరటాలువచ్చి విజయముఖం మీదిజుట్టును కదులాడించి విశ్వనాథం హృదయంలో కల్లోలం కలిగిస్తున్నాయి. పుష్టిగా, మృదువుగా వున్నికంఠంమీదా కారు నడుపుతూఉన్న నున్ననిచేతులమీదా చంద్రకిరణాలు మెరుగులు పెడు

తున్నాయి. ఇద్దరూ ప్రశాంతంగానూ, గంభీరంగానూ ఎవరికివాళ్లే ఏమో ఆలోచించుకుంటున్నారు. ముందుగా విశ్వమే మాట్లాడ్డానికి ప్రారంభించాడు. విజయ ఎంతవద్దన్నా అతని మాటలు వివాహవిషయానికే దారితీస్తున్నాయి.

“చూడు విజయా, నాముందుకూడా నీవు ఇంత గంభీకరించడము ఎందుకో నాకు అర్థం కావడంలేదు. లేకపోతే నేనే ఎక్కువగా మాట్లాడి నీ హృదయానికి ఆయాసం కలిగిస్తున్నానో...”

విజయ ఉదాసీనంగా “ఏ విషయంలో.....?”అంది.

విశ్వం:—మరి మీ నాన్నగారికి నన్నుచూస్తే అయిష్టం ఏమీ ఉన్నట్లులేదు. నీమట్టుకు నీకే నా స్థితిగతులు నచ్చకపోతేనూ, నేనంటే నీకు ఇష్టం లేకపోతేనూ, ఏదో టూకీగా ఈవివాహం సందర్భపడదూ అని చెప్పేస్తే ఈపిచ్చిఆశలన్నీ వదలుకొని మామూలుగా ఉంటాను.

విజయ:—అసలిది పెళ్లివిషయంఅన్నమాట. చూడు విశ్వం. ఏవిషయంలోనూ తొందరపడగూడదు. అందులో ముఖ్యంగా పెళ్లివిషయంలో ఆసలేకూడదు.

విశ్వానికి ఈ సమాధానం ఏమీ నచ్చలేదు. కొంచెం తీవ్రంగా కొట్టుకుంటూన్న గుండెల్తో ఉద్భృతంగా వస్తూన్న విశ్వాసాలతో ఇలాఅన్నాడు. “నిదానం అక్కర్లేకుండా ఇప్పుడే ఏ సుముహూర్తమో కుదరాలని కూచోడానికి నేనూ ఏదో కాస్త చదువుకున్నవాణ్ణే. కాని...ఎప్పటికైనా...”అంటూ కంఠం రుద్ధం అయిపోయి జేబుగుడ్డతీసి తుడుచుకోసాగాడు.

తోటలో చంద్రుడు తోటలోనే కూచోక వీళ్ల మాటలు వింటూ, వీళ్లతోనే వస్తున్నాడు. పొద్దుపోతూండడంచేత రాకపోకలు చాలా భాగం తగ్గి, రోడ్లుకూడా ఎక్కువ విశాలంగా కనిపిస్తున్నాయి. టాంగావాలాలు దొరికిన డబ్బుకొద్దీ పానీయాలు పట్టించుకొని రాగాలుతీస్తూ బళ్లు తోలుకుపోతున్నారు. అక్కడక్కడ ‘ఫుట్‌పాతు’లమీద ఒకళ్లిద్దరు స్నేహితులు కూచోని, అనాథాశ్రమం బాగుందో, కోకిల బాగుందో తర్కించుకుంటున్నారు.



రచయిత

విజయలక్ష్మి సమాధానవచనాలు చెబుతున్నది. “ఇంతలోకే కోపం వచ్చిందా, విశ్వం? నేను నిన్ను నమ్మడములేదని నీఉద్దేశ్యం కాబోలు. నేనుమాత్రం ఏమన్నాను...పోనీ...నీవు మాత్రం చూడ్డంలేదూ, తొందరపడి పెళ్లిచేసుకున్న దంపతు లెంతమందో అభిప్రాయభేదాలతో, అవిశ్వాసాలతో, అంతఃకలహాలతో, అసహ్యంగా రోజులు గడుపుకొంటూండడం. పైగా నిన్నే అనడంగాదుగాని సామాన్యంగా మగవాళ్లకి ప్రేమవిషయంలో స్థిరచిత్తం ఉండడం లేదు. పెళ్లయి ఆమె తన సొత్తుకాంగానే నిరాదరణ చేయడానికి ప్రారంభిస్తారు. ఇలాటి సందర్భాలు ఎన్నో చూస్తున్నాం. మొపాసా వర్క్సు తియ్యి చూద్దాం ఎన్ని కథలున్నాయో ఇలాంటివి.”

విశ్వనాథానికి ఏమీ సంతృప్తి కాలేదు. తన్ను సందేహించినా భరించేవాడే కాని తన ప్రణయాన్నే శంకించడం సహించలేకపోతున్నాడు.

కారు చౌరస్తా దగ్గిరకు వస్తూన్నది. అప్పటికి పొద్దుపోయి జనసంచారం తక్కువగా ఉండడంచేత వెన్నెలగా ఉండడంచేత పోలీసు కనిస్టేబిలు సైడు చూపడంమాని స్టేషనులో వెళ్లికూచున్నాడు.

ఆకస్మికంగా భయంకర సంఘటన జరిగిపోయింది.

ఆలోచనలతో పరధ్యాన్నంగా నడుపుతూన్న విజయలక్ష్మి కారు, మంచి "కైపుతో" ఉన్న డ్రైవరు నడుపుతున్న మరో కారుతో ఢీకొనడం తటస్థించింది. ఆ అదురుకు కారుకు టాపులేదు గనుక విజయలక్ష్మి వెళ్లి ఐదారు గజాలదూరంలో వెళ్లి పడి ఇంచుమించుగా స్పృహలేకుండ అయిపోయింది.

## 3

అప్పుడే వస్తూఉన్న స్పృహతో విజయలక్ష్మి కళ్లు తెరచి చూచేటప్పటికి ఒక విశాలమైన గదిలో మృదువైన పక్కమీద పడుకొని ఉన్నది. పక్కనున్న కుర్చీలో కూచొని కనిపెట్టుకొని ఉన్న విశ్వనాథం వెంటనే లేచి అప్పుడివ్వవలసిన మందు కలుపుతున్నాడు.

అది ఉస్మానియా జనరలు హాస్పిటల్లో, రెండో అంతస్తులో పడమరవైపునున్న నెంబరు 4 క్యాబిను (అద్దెగది). అది ప్రత్యేకం శ్రీమంతుల కోసమే ఏర్పాటు చెయ్యబడ్డది కనుక రోగి పక్కగా వేరేఒక కుర్చీ ఒక కుషనూ, ఒక డ్రెస్సింగు టేబిలూ మొదలైన వన్నీ ఉంటాయి.

రాత్రి నిష్క్రమించడానికి ఇంకా ఎంతోకాలం బట్టదు. పశ్చిమాకాశంలో క్రిందికి దిగిపోతూఉన్న చెంద్రుడు ఈ ప్రణయ జీవనులమీదికి తన శీత కిరణాలు ప్రశరింపజేసి హాయి కలిగిస్తున్నాడు. చెట్లల్లో నిద్రపోతూన్న పక్షులు నిద్రమత్తులోనే రెక్కలు తపలాడించి, కిచకిచమని కొంచెం గడబిడచేసి మళ్లీ నిద్రిస్తూ ఉన్నాయి. అక్కడక్కడ నిద్రపట్టని రోగుల మూల్గుళ్లు తప్ప, మిగిలిన వాతావరణమంతా ప్రశాంతంగా ఉంది.

మందు తీసుకున్న తరువాత బాగా స్పృహతెచ్చుకొని విజయలక్ష్మి, ఒకసారి తనస్థితి చూచుకొని, అర్థంకాక, నీరసపడ్డ గొంతుతో విశ్వనాథాన్ని అడిగింది "ఎలావచ్చాను విశ్వం ఇక్కడికి, ఈ ఎడంచేతికి దెబ్బతగిలిందా కట్టు కట్టారేం ?"

"మరేమీ ప్రమాదం లేదు, నీవేం ఎక్కువగా దిగులు పడవద్దు, నీవు కింద పడిపోయినప్పుడు బరువంతా ఈ చేతిమీదపడి బలమయిన దెబ్బ తగిలింది. వెంటనే ఇంకో టాక్సీలో మీ ఇంటికి తీసుకువెళ్లి, మీ నాన్నగారూ, అమ్మా, నేనూ కలిసి, ఇక్కడికి తీసుకు వచ్చాము. డాక్టరు దెబ్బ చాలా మంచి దెబ్బ అనీ, బహుశా ఎముకగూడా విరిగి ఉండవచ్చుననీ రేపు ఎక్సరే ఫోటో తీస్తాననీ చెప్పి ఇప్పటికి డ్రెస్ చేసి, కొంచెం మత్తుగానే ఉంటే బాధ తెలీకుండా ఉంటుందని ఏదో మందిచ్చి తెలివి వచ్చినప్పుడు ఈ మందు ఇవ్వమని చెప్పి వెళ్లాడు."

"వాళ్లేరీ అమ్మా నాన్నగారూనూ ?"

"ఇప్పటివరకూ ఇక్కడే ఉన్నారు కాని నిన్ను జాగ్రత్తగా చూచే భారం అంతా నేను తీసుకొని ఇంతకుముందే వాళ్లని పంపించివేశాను. మరేమీ కంగారు పడకు నీకేమీ లోపం రానియ్యను."

విజయ బాధగాఉన్న ఎడమచెయ్యి తడివిచూచుకొని "ఇక ఈచెయ్యి నాకు ఉండనే ఉండదేమో ? ఇక నేను ప్రపంచంలో ఎందుకూ పనికిరాకుండా అయిపోతాను..." అంటూ కళ్లల్లో నీళ్లు నింపుకున్నది. విశ్వం "ఇదుగో ఈ రెండుచేతులూ నీచేతికి బదులుగా తీసుకో, నన్ను నీ ఇష్టంవచ్చినట్లు ఉపయోగించుకో"అన్నాడు తనుగూడా నిండివస్తూన్న కళ్లతో.

విజయ—విశ్వం! ...ఇంకా ఇప్పుడుగూడా... ప్రేమిస్తావా నన్ను... ?

విశ్వం దెబ్బతగిలిన విజయచేతిని చూపిస్తూ— "ఇంతటితో ఇక విరమించుకొనడానికి...... నేను ఇన్నాళ్లనుంచీ ఆశిస్తున్నది......ఈ ఒక్క చేతిని కాదు,...నీ హృదయాన్ని......ఎప్పటికీ...దానికి నొప్పి తగలకుండా చూచుకునే భారం నాది..." అన్నాడు.

విజయలక్ష్మి కంపిస్తూఉన్న కుడిచేత్తో విశ్వనాథం తలను తీసుకువెళ్లి, అదురుతూఉన్న తన హృదయంలో చేర్చుకున్నది.

కార్యభారం తీరిన సంతృప్త హృదయంతో చెంద్రుడు నడకవేగాన్ని హెచ్చించి కిందికి దిగిపోయాడు.